# అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ను గెలిపించండి



గోషామహల్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ విజయం సాధించడం ఖాయమని గోషామహల్ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జ్‌లు ఆర్.చలపతి రావు, ఆశీష్‌కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. జాంబాగ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వారు ప్రచారాన్ని చేపట్టారు. నందకిశోర్ వ్యాస్‌కు రోజురోజుకు ప్రజల మద్దతు పెరుగుతోందన్నారు. **- అబిడ్స్, నవంబర్ 23**

## రాజేందర్ బహుముఖ ప్రజ్ఞాశాలి



తెలుగు భాషా సాహిత్యానికి విశేష సేవలందిస్తున్న మంగారి రాజేందర్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ప్రశంసించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ' నేను నా రచనలు ' శీర్షికతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా గురువారం కథా రచయిత, తెలంగాణ జ్యూడిషియల్ అకాడమీ డైరెక్టర్ మంగారి రాజేందర్ (జింబో) పాల్గొని తన స్వీయ జీవితం, సాహిత్య ప్రస్థానం వివరించారు. అధ్యక్షోపన్యాసం చేసిన ఆచార్య శివారెడ్డి న్యాయవాద వృత్తితో పాటు తెలుగు భాషా సాహిత్యాల్లో ప్రావీణ్యం సంపాదించిన రాజేందర్ ఎందరికో మార్గదర్శకంగా నిలిచారన్నారు. తెలుగు వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్, పరిషత్తు ప్రధాన కార్యదర్శి జె. చెన్నయ్య.. జింబో కలం పేరుతో రచనలు సాగిస్తున్న రాజేందర్ రావిశాస్త్రి తర్వాత రచనా స్వభావం రీత్యా గణనీయులని కొనియాడారు. **- తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 23**

## కులగణన వెంటనే చేపట్టాలి



బీహార్‌లో నితీశ్ ప్రభుత్వం కులగణన ఆధారంగా రిజర్వేషన్లను పెంచిన విధంగా అన్ని రాష్ర్టాల్లో కులగణన చేపట్టి పార్లమెంట్‌లో ఓబీసీ బిల్లు ప్రవేశపెట్టి ఓబీసీలకు రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని ఆల్ ఇండియా ఓబీసీ విద్యార్థి స్టూడెంట్ అసోసియేషన్ అన్నారు. బషీర్‌బాగ్‌లో ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు హైదరాబాద్ యూనివర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థి గౌడ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిరణ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి సాయికిరణ్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఉర్సు కొండల్, తెలంగాణ ఇన్‌చార్జి బొమ్మ ప్రవీణ్, హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం అధ్యక్షుడు వర్షం మల్లేశ్, కార్యదర్శి శివయాదవ్, వివిధ కాలేజీల బీసీ హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు. **- రవీంద్రభారతి, నవంబర్ 23**

## జాతీయ లోక్ అదాలత్ డిసెంబర్ 30కి మార్పు

నాంపల్లి కోర్టులు, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ) : శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జాతీయ లోక్ అదాలత్ తేదీని డిసెంబర్ 30కి మార్చుతూ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. డిసెంబర్ 9న జరగాల్సిన లోక్ అదాలత్‌ను ఎన్నికల సందర్భంగా మార్పు చేసినట్టు ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌కు పోలీసు అధికారులు అందుబాటులో ఉండకపోవడం వల్లే తేదీని మార్పు చేశారు.

## బిల్డింగ్‌పై నుంచి పడి విశ్రాంత ఉద్యోగి మృతి

కాచిగూడ,నవంబర్ 23: వాకింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి పడి విశ్రాంత ఉద్యోగి మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై అలీబేగ్ తెలిపిన వివరాల ప్రకారం తిలక్‌నగర్ ప్రాంతానికి చెందిన పానకాల స్వామి కుమారుడు బ్రహ్మానందం(68) కొన్ని రోజులుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. గురువారం ఉదయం బ్రహ్మానందం బిల్డింగ్‌పై వాకింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కాచిగూడ ఎస్సై కోరారు.



గన్‌ఫౌండ్రి డివిజన్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర ట్రేడ్ సెల్ అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, అభ్యర్థి నందకిశోర్ వ్యాస్, మాజీ కార్పొరేటర్ రాంచంద్రరాజు

అబిడ్స్, నవంబర్ 23 : గోషామహల్ నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పోటీలో ఉన్నట్లుగా భావిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి పార్టీ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర ట్రేడ్ సెల్ అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి కోరారు. గన్‌ఫౌండ్రి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో అభ్యర్థి వ్యాస్‌తో కలిసి పలు ప్రాంతాల్లో పాదయాత్ర చేసి ఓటర్లను కలిసి బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మమతా సంతోష్ గుప్తా, రాంచంద్రరాజు, దిలీప్ గనాతే, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

### మంత్రి కేటీఆర్ దత్తత తీసుకుంటున్నారని..

వ్యాస్‌కు మద్దతుగా నగర బీఆర్ఎస్ ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్‌కుమార్ మంగళ్‌హాట్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్, బీఆర్ఎస్ అభ్యర్థి వ్యాస్ సతీమణి ఉమాదేవి వ్యాస్ పార్టీ నాయకులతో కలిసి కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. దాసోజు శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు గుర్తించారని, అందుకే నందకిషోర్ వ్యాస్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. నందకిషోర్ వ్యాస్‌ను గెలిపిస్తే గోషామహల్ నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటానని రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ప్రకటించడంతో నియోజకవర్గం ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, వాసుదేవరావు, హెచ్. కుమార్, బుజ్జి, దినేశ్ సింగ్, సి. ఆంజనేయులు పాల్గొన్నారు.


గోషామహల్ అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ను గెలిపించాలని రాష్ట్ర బీఆర్ఎస్ కార్మిక విభాగం ఈఎస్ఐ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జ్‌లు ఆర్.చలపతిరావు, ఆశీష్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్‌వ్యాస్‌కు మద్దతుగా జాంబాగ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేపట్టారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్నారని వివరించారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతోందని తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి వ్యాస్‌ను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి పనులను చేపడ్తారని తెలిపారు. ఎమ్మెల్యే రాజాసింగ్‌ను గోషామహల్ ప్రజలు రెండుసార్లు గెలిపిస్తే అభివృద్ధి మాత్రం శూన్యం చేశారన్నారు. అభివృద్ధిని విస్మరించిన రాజాసింగ్ ఇంటికి పోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆర్‌వీ మహేందర్ కుమార్, ఎస్.ధన్‌రాజ్, పి.నరేందర్‌యాదవ్, ముఖేశ్ ముదిరాజ్, సురేశ్, పి.అనిత పాల్గొన్నారు.

### ఒక్కసారి అవకాశమివ్వండి

సుల్తాన్‌బజార్, నవంబర్ 23 : పదేండ్ల బీజేపీ పాలనలో గోషామహల్ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ అన్నా రు. గురువారం గన్‌ఫౌండ్రి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్‌గుప్తా, సీనియర్ నాయకులు సంతోష్ గుప్తా, ఎంపీ రామచంద్రరాజు, దిలీప్ ఘనాతేలతో కలిసి ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అభ్యర్థి గెలవకున్నా ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను బలపర్చాలని ఓటర్లను కోరారు. డివిజన్ బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్ గుప్తా మాట్లాడుతూ.. గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశో ర్‌వ్యాస్‌కు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.



రహీంపురాలో మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్, బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ సతీమణి ఉమాదేవి వ్యాస్ పార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్న నగర బీఆర్ఎస్ ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్‌కుమార్



ప్రచారంలో పాల్గొన్న నియోజకవర్గం బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జ్‌లు చలపతి రావు, ఆశీష్‌కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు ఆర్‌వీ మహేందర్‌కుమార్



కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థి వ్యాస్, గన్ ఫౌండ్రి మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్ గుప్తా



గోషామహల్ బీజేపీ అభ్యర్థి టి.రాజాసింగ్ ప్రచారాన్ని చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే ప్రేమ్ సింగ్ రాథోడ్, బేగంబజార్ కార్పొరేటర్ జి.శంకర్ యాదవ్‌తో కలిసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. **- అబిడ్స్, నవంబర్ 23**



గోషామహల్ కాంగ్రెస్ అభ్యర్థి మొగిలి సునీత ప్రచారాన్ని నిర్వహించారు. బీ – బ్లాక్ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. **- సుల్తాన్‌బజార్, నవంబర్ 23**

## కిషన్ పహిల్వాన్ మృతి



అబిడ్స్, నవంబర్ 23 : కనక దుర్గమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ ఎం.కిషన్ పహిల్వాన్ గురువారం తెల్లవారు జామున మృతి చెందారు. పురానాపూల్ స్వామి వివేకానందనగర్‌లోని ఆలయ కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్న కిషన్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. పాతనగరంలోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలుసుకున్న చార్మినార్ నియోజకవర్గం మజ్లిస్ అభ్యర్థి మీర్ జుల్ఫేకర్ అలి, పురానాపూల్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్, బీఆర్ఎస్ నాయకులు ఎక్కాల నందు, టీటీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎం. అరవింద్‌కుమార్‌గౌడ్‌తో బస్తీవాసులు, పలు పార్టీల నాయకులు, సంఘాల నాయకులు ఆయన నివాసానికి చేరుకుని నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

### పిన్ స్విమ్మింగ్

## చాంపియన్ షిప్ పోటీలకు స్టీఫెన్‌కుమార్

కాచిగూడ,నవంబర్ 23: థాయిలాండ్‌లోని పుకెట్ నగరంలో ఈ నెల 24 నుంచి 28 వ తేదీ వరకు జరుగనున్న ఆరో ఏషియన్ జూనియర్ పిన్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీలకు తెలంగాణ,బర్కత్‌పుర ప్రాంతానికి విద్యార్థి స్విమ్మర్ స్టీఫెన్‌కుమార్ ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఏషియన్ పోటీల్లో పాల్గొంటున్న తొలి స్విమ్మర్‌గా స్టీఫెన్‌కుమార్ రికార్డు కెక్కారు. పిన్ స్విమ్మింగ్ 50 మీటర్లు, 100 మీటర్లు, 400 మీటర్లు,మోనోఫిన్,బైఫిన్ పోటీలలో పాల్గొననున్నట్లు విలేకరుల సమావేశంలో స్టీఫెన్‌కుమార్ తెలిపారు.

## రైలు కిందపడి వృద్ధుడు ఆత్మహత్య

కాచిగూడ,నవంబర్ 23: కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది ఓ వృద్ధుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం ఉప్పుగూడలోని పటేల్‌నగర్ ప్రాంతానికి చెందిన గంగారెడ్డి కుమారుడు నీలం రాజారెడ్డి(74) కుటుంబంలో కలహాలు జరుగుతున్నాయి. దీంతో రాజారెడ్డి గురువారం ఉప్పుగూడ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.